# ది డిజాస్టర్

"ఆలం- యే మా అబ్బాయిని చంపేసింది" అంటూ అరిచాడు సత్యవంతరావు.

అంత పెద్ద వయస్సాయన, అంత పెద్ద వ్యాపారస్తుడు, మర్యాదస్తుడు అటువంటి భాష ఉపయోగించడం కాస్త వెగటుగా తోచింది.

"సార్, అనసూయ మీ కోడలు. మీకు ఎంత కోపం ఉన్నా, అనుమానం ఉన్నా, మీరలా మాట్లాడ్డం భావ్యం కాదు" అంటూ వారించబోయాను.

"అనసూయ అంటే అదేమైనా సతీ అనసూయా? నైట్ క్లబ్బులో డ్యాన్సర్. అక్కడ అనూష్కానో, మరోటో ఓ ఫ్యాన్సీ పేరు పెట్టుకుంది. నా ఖర్మ కొద్దీ మావాడిని తగులుకుంది. బొంబాయి తీసుకెళ్లి చంపేసింది."

"సార్, మీరు చెప్పేది నాకు ఏమాత్రం నమ్మకంగా లేదు. మీ అబ్బాయి జయంత్ పోయింది అహమదాబాద్ భూకంపంలో. ఆమె అక్కడికి తీసుకెళ్లి కావాలని భూకంపం తెప్పించలేదు కదా! తను కూడా భూకంపానికి బలి అయ్యేదే, దైవవశాత్తూ తప్పించుకుంది. ఇన్స్యూరెన్స్ ఎమౌంట్ క్లెయిమ్ చేస్తోంది కదాని ఇది ముందే ప్లాను చేసిందని అనడం సరికాదు..." అంటూ నచ్చచెప్పబోయాను.

ఆయనకి కోపం వచ్చేసింది. "చూడండి రావు గారూ, మా బెస్ట్ ఫ్రెండ్ భాస్కర్ మీరు మంచి డిటెక్టివ్ అని చెబితే మీ దగ్గరకి వచ్చాను. మా అబ్బాయిది హత్య కాదని, ప్రమాదమని మీరు చెప్పే కారణాలు ఎవడైనా చెప్పగలడు. మీరైతే ఇంకా లోతు కెళ్లి పరిశోధించగలరని ఆశపెట్టుకుని వస్తే..."

"మీరు ఆశ పెట్టుకున్నారు కదాని, వాస్తవాలు తారుమారు చేయలేను కదా! మీ మాట వినలేదని మీ అబ్బాయి మీద మీకు కోపం. మీ నుండి వేరు చేసిందని అనసూయ మీద కసి. దాంతో మీరు విచక్షణా జ్ఞానం కోల్పోతున్నారు. నా క్లయింట్‌ని మభ్యపరచి లేని కేసుని చేపట్టడం నా పద్ధతి కాదు, మీరేమనుకున్నా సరే!" అని ఖరాఖండీగా చెప్పేను.

ఆయన కాస్త తమాయించుకున్నాడు. గ్లాసు నీళ్లు తెప్పించుకుని తాగేడు. తన వాదన ఇంకోలా మొదలుపెట్టాడు. "మా అబ్బాయి భూకంపంలో పోయాడన్నమాట కాస్సేపు పక్కనబెట్టి ఆలోచిస్తే 30 లక్షలకు ఇన్సూరెన్స్ చేయడం అనేది చాలా వింతగా లేదూ? కన్సిడర్ ది ఎవైలబుల్ ఫాక్ట్స్ -

"జయంత్ ఒక డబ్బున్న తండ్రి కొడుకు. తల్లి తొమ్మిదో ఏటే పోయింది. తండ్రి బిజినెస్ వ్యవహారాల్లో పడి క్రమశిక్షణలో పెంచలేదు. డిగ్రీ తప్పాడు. తండ్రికి కోపం వచ్చింది. కట్టడి చేశాడు. ఇతను ఎదురు తిరిగేడు. ఇంకా అల్లరి చిల్లరిగా తిరిగేడు. చెడు సావాసాలు మరిగేడు. నైట్ క్లబ్బులు పట్టుకు తిరిగేడు. 'ప్లేబోయ్' అనే టాప్‌లెస్ క్లబ్బులో డాన్సర్ అయిన అనసూయతో పరిచయం అయింది. పెళ్లి చేసుకోమంది. పెళ్లికి తండ్రి ఒప్పుకోలేదు. ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వనని చెప్పి తరిమేసాడు. అయినా పెళ్లి చేసుకుని, కాపురం పెట్టేసాడు. ఉద్యోగం లేదు, రాదు. ఆదాయం ఎక్కడనుండి వస్తోందో తెలియదు. అలాటివాడు 30 లక్షలకు ఇన్సూర్ ఎలా చేయగలిగేడు? ఎందుకు చేశాడు? అదీ పెళ్లయిన మూడు నెలలకే! ఇన్సూర్ చేసిన రెండు నెలలకే చచ్చిపోయాడు. మీకు అనుమానం రావటం లేదా?"

సత్యవంతరావుకి సలాం చేయబుద్ధేసింది. గొప్ప లాజికల్‌గా వాదించాడు. ఇంత పెద్ద వ్యాపారస్తుడయ్యాడంటే మాటలా? పెన్సిల్ కొరుకుతూ కాస్సేపు ఆలోచించాను. తర్వాత జవాబిచ్చేను.

"మీరు చక్కటి అనుమానం లేవనెత్తారు. కానీ ఒక విషయం వదిలిపెడుతున్నారు. మీ అబ్బాయికి

ఆదాయం ఎక్కణ్నుంచి వస్తోంది అని అడిగేరు కదా..., ప్లేబోయ్ క్లబ్బు గురించి నాకు బాగా తెలుసు. పైకి రెస్టారెంటు కానీ సెల్లార్‌లో రహస్యంగా టాప్‌లెస్ సెర్వింగ్, క్యాబరే డాన్సులు నడుస్తాయి. అది జయపాల్ అని ఒకతను నడుపుతున్నాడు. చాలా పలుకుబడి ఉన్నవాడు కాబట్టే పోలీసులు అతని జోలికి పోరు. అటువంటి వాళ్లకు స్మగ్లింగ్, ఇతర చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు ఉండడం అసహజం కాదు. ఐ యామ్ సారీ టు సే, మీ అబ్బాయి గత్యంతరం లేక వాటిల్లో ఇరుక్కుని ఉంటాడు..."

"...అలా ఎలా చెప్పగలరు? బతకడానికి లక్షా తొంభై మార్గాలు ఉన్నాయి."

"ఆలోచించి చూడండి. మీరు తొందరపడి మీ అబ్బాయిని ఇంట్లోంచి గెంటేశారు. ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వననేశారు. చిన్నప్పటినుండి జల్సా జీవితానికి అలవాటు పడ్డవాడు ఇవాళ రిక్షా తొక్కి బతకడు కదా! ఈజీమనీ వచ్చేది ఇలాంటి పనుల్లోనే. బయటకు వచ్చేసినా అతను తిండికి అలమటించలేదు. ఒక మంచి ఏరియాలో, చక్కటి ఇల్లు అద్దెకు తీసుకుని భార్యతో కులాసాగా గడుపుతున్నాడు. భార్యచేత డాన్స్ మాన్పించాడు. ఊళ్లు తిరిగేంత డబ్బు సంపాదిస్తున్నాడు."

"...నా పేరు చెప్పుకుని అప్పులు చేసి బతుకుతున్నాడేమో! నాకూ, వాడికీ గొడవలున్న సంగతి ఎవరికీ తెలియదు కదా!"

"కావచ్చు. ఇదీ ఒక పద్ధతి కావచ్చు. కానీ నా మట్టుకు నాకు అతను స్మగ్లింగ్, డ్రగ్ ట్రాఫికింగ్ వంటి వ్యాపారాల్లో పడ్డాడేమోనని అనిపిస్తోంది. వాటిల్లో ప్రాణానికి భద్రత తక్కువ. తనకేదైనా అయితే భార్యకు దిక్కు లేకుండా పోతుందని భారీ మొత్తంలో ఇన్స్యూర్ చేయించాడు. ఇన్సూరెన్స్ కంపెనీవాళ్లు మీ పరపతి చూసి, సరిగ్గా వెరిఫై చేయకుండా పాలసీ ఇచ్చేసి ఉంటారు. అనుకోకుండా వీళ్లు అహ్మదాబాద్ వెళ్లిన రోజునే భూకంపం రావడం, దాంట్లో అతను పోవడం, అనసూయ బతకడంతో ఆ పాలసీ డబ్బు అడగడం జరిగింది. దాంతో మీకు అనుమానం వచ్చింది."

"వెయిట్! వీళ్లు అవాళ అహ్మదాబాద్‌కి ఎందుకు వెళ్లాలండి? అక్కడ ఫ్రెండ్స్ లేరు, బంధువులు లేరు. నా అనుమానం వాళ్లు అక్కడికి వెళ్లలేదు. మూడురోజుల క్రితం బొంబాయి వెళ్లారు. అక్కడ హోటల్లో ఉన్నారు. ఈ అనసూయే మా వాడిని ఏదో మత్తుమందిచ్చేసి సముద్రంలోకి తోసేసి ఉంటుంది. అహ్మదాబాదులో వచ్చిన భూకంపాన్ని తన కథకు అనుగుణంగా ఉపయోగించుకుంటోంది."

"అహ్మదాబాదులో ఎక్కడ దిగారట?"

"ఏదో హోటల్‌ట. అది భూకంపంలో నాశనమయిపోయిందిట. రికార్డులు చూడడం బ్రహ్మతరం కాదు."

"పోనీ బొంబాయి నుండి అహ్మదాబాద్‌కి విమానంలోనో, రైల్లోనో వెళ్లి ఉంటారుగా. టిక్కెట్టు వివరాలు తీసుకుని..."

"...బస్సులో వెళ్లామంటోంది. ఆ..., సారీ, ..అనసూయ. ఇంకేం చెక్ చేస్తాం? అహ్మదాబాద్‌లో ఆ రోజు ఉదయమే దిగారట. ఆ తర్వాత మరో రెండు గంటల్లో భూకంపం వచ్చి మా వాడు పోయాట్ట. అది మాత్రం నిక్షేపంలా ఉందిట! చెప్పేవాడికి బుద్ధి లేకపోతే వినేవాడికి వివేకం ఉండాలి. కానీ ఈ ఇన్సూరెన్స్ కంపెనీవాళ్లకు అదెక్కడ ఉంది? భూకంపబాధితులు అనగానే కంపించిపోతున్నారు. క్లెయిమ్ సెటిల్ చేయకపోతే ఎక్కడ గొడవలొస్తాయోనని భయపడి ఛస్తున్నారు. అన్నీ సరిగ్గా చూడటం లేదు."

సత్యవంతరావు మాటల్లో కొంతైనా పాయింటు లేకపోలేదు. కేసు చేపట్టడానికి ఒప్పుకున్నాను. అనసూయను ఉరికంబం ఎక్కించడమే ఆయన ధ్యేయం. ఆ హామీ ఇవ్వలేను కానీ నా ప్రయత్నం నేను చేస్తానన్నాను.

ముందుగా వెళ్లినది 'ప్లేబోయ్' క్లబ్బుకి. వెళ్లిన కాస్సేపటికే సెర్వ్ చేసేవాళ్లలో ఓ అమ్మాయిని మచ్చిక చేసుకున్నాను. పేరు రంజిత. "ఇంకో గంటలో డ్యూటీ అయిపోతుంది. అంతదాకా ఆగితే మందు కొట్టడానికి కంపెనీ ఇస్తాను" అంది. "అంతకన్నానా?" అన్నాను. ఆమె వచ్చేదాకా చూసిన

డాన్సుకంటే, రంజిత చెప్పిన సమాచారమే ఎక్కువ కిక్కిచ్చింది.

"అనూష్కా కనబడటం లేదు. డ్యూటీలో లేదా?" అన్నాను కాస్సేపు సంభాషణ నడిపిన తర్వాత. రంజిత అదోలా చూసింది. "ఏం? పాత పరిచయమా? ఇక ఎవరికీ అందదులే! నా లాటి వాళ్లతో సరిపెట్టుకోవాల్సిందే!" అంది వెటకారంగా.

"సరిపెట్టుకోవడం ఏమిటి? ఇటీజె ప్లెజర్! ఆమె కంటె నువ్వు పదింతలు బాగున్నావు" అన్నాను.

రంజిత పొంగిపోయింది. "నీకున్న టేస్టు వాళ్లిద్దరికీ లేదు. మా అందరికంటే జీతం ఎక్కువిచ్చిన వాడొకడు. అదంటే పడిచచ్చి పెళ్లిచేసుకున్న కుర్రాడొకడు" అంది.

"ఇద్దరెవరు?"

"ఇంకెవరు? మా ఓనరు జయపాల్. అదంటే మహా వెర్రి. ఇంకోడు ఇండస్ట్రియలిస్ట్ సత్యవంతరావు కొడుకు. జయపాల్‌కీ, దానికీ సంబంధం ఉన్న విషయం తెలుసో, తెలియదో మనకు తెలియదు. కానీ వాడిమాట విని దాన్ని పెళ్లాడేసాడు. తమాషా ఏమిటో తెలుసా, రిజిస్ట్రార్ ఆఫీసులో సాక్షి సంతకం పెట్టినది ఎవరో తెలుసా, పెళ్లికూతురు రంకుమొగుడు జయపాల్! గొప్పగా ఉంది కదూ!"

క్లబ్బులోంచి బయటకు వచ్చేసినా రంజిత మాటలు చెవిలో గింగురుమనడంతో ఆ రాత్రి నా నిఘా అనసూయ ఇంటి బయటనే! రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో జయపాల్ వచ్చాడు. తిరిగి బయటకు వచ్చేసరికి రెండు దాటింది. సత్యవంతరావు థియరీలో కాస్త నిజం ఉన్నట్టే ఉంది. జయపాలే అనసూయ ద్వారా జయంత్‌ని బుట్టలో పెట్టి, ఇన్సూర్ చేయించి, తర్వాత చంపేసి ఉంటాడు.

కానీ జయంత్ మరణించింది భూకంపంలో. జయపాల్ ఎంత సమర్థుడైనా భూకంపం ఏర్పాటు చేసేటంతటి ఘనుడు కాదుగా! మరి!? భూకంపాన్ని వీళ్లకు అనువుగా వాడుకున్నారనుకుంటే అహ్మదాబాదులో అది వస్తుందని ముందుగానే వీళ్లు ఊహించలేరు కదా! అక్కడికి ఎందుకు వెళ్లి ఉండాలి? అసలు వెళ్లారా? ఎలా తెలుసుకోవడం?

ఇన్సూరెన్స్ కంపెనీలో ఈ వ్యవహారం చూసే అతను నాకు ముందుగానే మరోకేసులో పరిచయమైన వ్యక్తి. వివరాలు అడిగాను.

"క్లెయిమ్ చాలా అనుమానం కలిగించేట్లా ఉందండి. జయంత్, భార్యా హనీమూన్‌కి బొంబాయి వెళ్లామన్నారండి. పెళ్లయిన ఆర్నెల్లకు హనీమూన్ ఏమిటంటే అప్పటిదాకా డబ్బు సమకూరలేదన్నారు. సరే, అక్కణ్నుంచి భూకంపం వచ్చిన ముందురోజు రాత్రే బస్సులో బయలుదేరి అహ్మదాబాద్‌కి వెళ్లామన్నారు. అది మరీ అంత అసహజమైనదేమీ కాదు. చాలామంది బస్సులో వెళుతూనే ఉంటారు. అహ్మదాబాదులో వీళ్లు దిగామంటున్న హోటల్ కూలిపోయింది. రికార్డులు లేవు. బొంబాయిలో వీళ్లు బసచేసిన హోటల్ రిజిస్టరు చూసాను. ముందురోజు రాత్రి ఖాళీ చేసినట్టు స్పష్టంగా ఉంది..."

"అది ఏ హోటల్?"

"హోటల్ బృందావన్. అసలు ఇవన్నీ కనుక్కుంటున్నందుకే మా బాస్ విసుక్కుంటున్నారు. క్లెయిమ్ సెటిల్‌మెంటు ఆలస్యం చేస్తే పేపర్లకెక్కుతాం. ఏదో ఒకటి ఇచ్చిపడేయ్ అంటున్నారు." అని వాపోయాడు. అతని కష్టాలు అతనివి.

బొంబాయిలో మా వృత్తిలోనే ఉన్న ఫ్రెండు ఒకతనికి ఫోన్ చేసాను. హోటల్ బృందావన్ రాసలీలలకు ప్రసిద్ధిట. ఇంకేం? దాని ఓవర్ జయపాల్ గ్యాంగ్ వాడే అయివుంటాడు. లేదా ప్రొఫెషనల్ లింక్స్ ఏమైనా ఉండి ఉంటాయి. రిజిస్టర్ తారుమారు చేయడం పెద్ద విషయం కాదు. జయంత్, అనసూయ బొంబాయి వెళ్లడం కూడా ఏదైనా స్మగ్లింగ్ వ్యవహారం మీదనే అయివుండవచ్చు. అక్కడ జయంత్‌ని చంపేసి, మర్నాడు భూకంపం న్యూస్ చూడగానే ఈ ప్లాను వేసివుండవచ్చు.

ఆలోచన అంతా బాగానే ఉంది కానీ దీనికి ఆధారాలేవీ? జయపాల్ గతం గురించి తవ్వడానికి మా పోలీసు మిత్రులను కదలేసి చూసాను. మూడోరోజుకి తగిలేడు బ్రహ్మం.



"మా వూరివాడే గురూ! ముందులో కండబలం తప్ప మరేమీ లేదు. వీడికి తెలివితేటలు మప్పింది - రాంరెడ్డి అని క్రిమినల్ లాయర్. వీడిచేత ఓ రైసు మిల్లు పెట్టించి, దాన్ని తగలబెట్టించి, లంచాలు పెట్టించి, దొంగ క్లెయిమ్ పెట్టించి ఇన్సూరెన్స్ కంపెనీ నుండి డబ్బు కొట్టేశాడు. ఆ డబ్బు పెట్టుబడిగా పెట్టి హోటల్ పెట్టి..."

ఇక వినడం మానేశాను. ఇన్సూరెన్స్ కంపెనీని దోచగలడు అన్న విషయం తెలిసిన తర్వాత తక్కినవన్నీ అనవసరం. జయపాల్ మాస్టర్ ప్లానే అది! సందేహం లేదు. ఇక సాక్ష్యాలు సంపాదించడం ఒక్కటే తరువాయి.

అనసూయ ఫోన్ నెంబరు డైరక్టరీలో దొరికింది. ఫోన్ చేశాను. "టెలిఫోన్ డిపార్ట్‌మెంటు నుండి ఫోన్ చేస్తున్నానండి. మీరు క్రితం ఆగస్టు నెల బిల్లు కట్టినట్టు మా రికార్డులో కనబడటం లేదు. కట్టారా? లేదా అని చెక్ చేద్దామని..."

ఆవిడకి కోపం వచ్చినట్టుంది. "ఇది అప్పుడే జనవరి. ఆగస్టు నెల బిల్లు కట్టకపోతే, తర్వాత బిల్లులో అది కలిపివుండేవారుగా!"

"అదే మేడమ్, అందుకే అనుమానం వచ్చి పర్సనల్‌గా వెరిఫై చేసుకుంటున్నాం. లేకపోతే డిస్‌కనెక్ట్ చేసేసేవాళ్లంగా..." అన్నాను కాస్త వినయంగానే.

ఆవిడ చల్లబడింది. "కాస్త ఆగండి. చెక్‌బుక్ చూసి చెప్తాను." అంది. రెండు నిమిషాల్లో చెక్

నెంబరు, బ్యాంక్ పేరు, బ్రాంచ్ పేరు అన్నీ చెప్పింది. నాక్కావలసినది అదే! హత్య చేయడంతో కథ ముగిసిపోదు. చేసినవాడికి అడ్వాన్సు పోను తక్కిన డబ్బు చెల్లించవలసి ఉంటుంది. 'పోలీసులు నీ దగ్గరికి రాలేదు కదా, ఎవరూ అనుమానించలేదు కదా' అంటూ అడగవలసి ఉంటుంది. అన్నిటికీ ఉపయోగపడేది బ్యాంకూ, ఫోనూ.

బ్యాంక్‌కి వెళ్లి చెక్‌నెంబరు ద్వారా అక్కవుంటు నెంబరు కనుక్కుని అక్కవుంటు చూశాను. అనుమానించవలసినంత పెద్ద మొత్తాల్లో చెల్లింపులేవీ జరగలేదు కానీ, అంతకుముందు రోజే ఢిల్లీలో గజేంద్ర పాఠక్ అనే అతనికి ఇరవై వేల డ్రాఫ్టు పంపించినట్టు తెలిసింది. ఆ పాటి మొత్తానికి హత్యతో సంబంధం ఉండేట్లా కనబడలేదు. వేరే వ్యవహారాలేమైనా ఉన్నాయేమో! అని ఊరుకున్నాను.

అక్కణ్నుంచి టెలిఫోన్ డిపార్ట్‌మెంటుకి వెళ్లాను. అనసూయ ఫోన్ నెంబరు నాదేనని చెప్పి, 'మిస్‌యూజ్ అవుతోందని అనుమానంగా ఉంది. ఈ మధ్య ఈ నెంబరు నుండి కాల్ చేసిన నెంబర్లు చూపిస్తారా?' అని బ్రతిమాలేను. సరేనని వాళ్లు చూపించిన లిస్టు పరికించాను. ఢిల్లీలో ఒక నెంబరుకు రెండుసార్లు ఫోన్ చేసినట్టు ఉంది. అదే నెంబరుకు ఫోన్ చేశాను. అది "కుతుబ్ హోటల్" అనే హోటల్‌ట! జయంత్ పోయిన తర్వాత అనసూయ స్మగ్లింగ్ వ్యాపారం మొదలుపెట్టిందేమో! ఇన్సూరెన్స్ క్లెయిమ్ వచ్చేదాకా బండి నడవాలిగా! ఉంపుడుగత్తెకి డబ్బిచ్చే అలవాటు జయపాల్‌కి ఉందో లేదో!

సత్యవంతరావు గారికి ఫోన్ చేసి విషయమంతా చెప్పాను. "ఇరవై వేల రూపాయలకు హత్య చేసేవాళ్లుండరండి. పోనీ భారీ ఎడ్వాన్సు ఇచ్చారనుకున్నా, ఇది చాలా ఆడ్ ఎమౌంట్‌గా ఉంది. ఢిల్లీ వెళితే తప్ప తెలియదు. కానీ అనసూయ స్మగ్లింగ్ వ్యవహారాలతో మనకు సంబంధం ఏముంది కనక?"

"అలా అనకండి. దాన్ని ఏదో విధంగా జైలుకి పంపిస్తే నాకు చాలు. ఖర్చు కోసం వెనుకాడకండి. మీరు వెంటనే ఢిల్లీ వెళ్లండి. డబ్బు నేనిస్తా. ఆ హోటల్‌లోనే ఆ గజేంద్ర గాడు ఉన్నాడేమో! డబ్బు పంపుతున్నానని ముందు ఫోన్ చేసి, తర్వాత డ్రాఫ్టు పంపివుంటుంది. స్మగ్లర్లలో కూడా నిజాయితీ నశిస్తున్నట్టుగా ఉంది. నోటిమాట మీద డబ్బు పుట్టడం లేదులా ఉంది. డ్రాఫ్టులు పంపాల్సివస్తోంది! అది మన సాక్ష్యానికి పనికివస్తుంది. మీరు తక్షణం వెళ్లండి" అన్నాడాయన.

ఢిల్లీలో కుతుబ్‌హోటల్ కెళ్లి అడిగితే గజేంద్రపాఠక్ రూమ్ నెంబరు 202 అన్నారు. రూమ్‌లో అతనున్నాడు కూడా! అతన్ని చూస్తూనే ఉలిక్కిపడ్డాను. సత్యవంతరావు ఇచ్చిన ఫోటో చూసానుగా!

"జయంత్! ఏమిటీ నాటకం?" అన్నాను మందలిస్తున్నట్టు.

అతను ఖంగారుపడ్డాడు. "ఎవరు నువ్వు?" అంటూ.

"నేనెవరైనదీ తర్వాత చెప్తాను. ముందుగా నువ్వు తెలుసుకోదగినది అనసూయ, జయపాల్ వేసిన ప్లానులో ఒక పావుగా ఉండడానికి అంగీకరించడం నీ బుద్ధితక్కువతనం. నిన్నిక్కడకు పంపి వాళ్లిద్దరూ కలిసి కులుకుతున్నారు తెలుసా! ఈ గొడవంతా తేలేవరకూ నిన్ను ఊరుకోబెట్టి, డబ్బు వచ్చాక ఇద్దరూ కలిసి నిన్ను చంపేస్తారు, చూసుకో..."

"నాన్సెన్స్" అన్నాడు జయంత్. అన్నాడు కానీ నేను చెప్పిన వివరాలన్నీ విన్నాక, అనసూయ ఇంట్లో నేను తీసిన ఫోటోలు చూశాక ఒప్పుకోక తప్పింది కాదు. వెంటనే తండ్రికి ఫోన్ చేశాడు. క్షమాపణలు చెబుతూ, ఇకమీదైనా బుద్ధిగా ఉంటానని హామీ ఇస్తూ.